


**1985 రక్తాక్షి సంక్రాంతి కథల పోటీలో**

**కన్సోలేషన్ బహుమతి రు. 116/-లు**

**పొందిన కథ**

"మనం తిరుపతి ఎప్పుడెళ్దాం?" అడిగింది శ్రీలక్ష్మి, సున్నం రాసిన తమలపాకులు అందిస్తూ.

సిగరెట్ కాలుస్తూ సీలింగ్ ఫ్యాన్‌వైపు చూస్తున్న సుకుమార్ ఏదో వినకూడని మాట విన్నట్టు ఉలిక్కిపడ్డాడు.

"తిరుపతా? ఎందుకు వెళ్ళడం?"

"నా పెళ్ళయ్యాక కొండకు వస్తానని మా నాన్న మొక్కుకున్నాడు"

"అయితే మీ నాన్ననే వెళ్ళమను" అన్నాడు సుకుమార్ వెండి భరిణెలోంచి వక్క-పొడి తీసుకుంటూ.

"ఆయనొక్కడే ఎలా వెళ్తాడు? మనిద్దరం, మా అమ్మ అందరం వెళ్ళాలి"

"నాకలాంటి మూఢనమ్మకాలేం లేవు. నేను రాను" అన్నాడు సుకుమార్ సిగరెట్ యాష్ట్రేలో పడేసి పడుకుంటూ.

శ్రీలక్ష్మి మొహం పాలిపోయింది. పెళ్ళయిన వారం రోజుల్లోనే గొడవ రావడం ఇది రెండోసారి. పెళ్ళిరోజున

# విడాకులు

పులిపాక శ్రీరామచంద్రమూర్తి



బ్రాహ్మడి మంత్రాలకు అర్థం పర్థం లేదని సుకుమార్ అన్నప్పుడు ఆమె మెల్లిగా నవ్వింది తలొంచుకొని. అరుంధతీ నక్షత్రం చూడ్డం దగ్గర పురోహితుడితో గొడవ పెట్టుకున్నాడు. 'ఆ నక్షత్రం ఎందుకు చూడాలంటూ.' శ్రీలక్ష్మి అతని భుజం మీద మెల్లిగా గిల్లింది. కాని అతనేమీ పట్టించుకోలేదు. పక్కనే వున్న ఆమె తండ్రి నొచ్చుకున్నాడు.

తనకి మాత్రం ఆ నక్షత్రం కనిపించి ఏడిసిందా, అనుకుంది శ్రీలక్ష్మి ఒకే తమలపాకు మీద సున్నం రాస్తూ. అసలే ఆకాశం మబ్బు పట్టి వుంది. పెద్దవాళ్ళ తృప్తికోసం చూసింది. తనూ చూదొచ్చుగా. ఉహుఁ ససేమిరా మొండికెత్తాడు. తర్వాత తను బట్టలు మార్చుకుంటుంటే అమ్మ వచ్చి గొంతు తగ్గించి అంది.

"మీ ఆయన నాస్తికుడు."

"నక్షత్రం కనబట్టం లేదని అలా అన్నారు కాని ఆయనేం నాస్తికుడు కాదు" అంది తను భర్తను వెనకేసుకొస్తూ. తర్వాత అదేమాట పెద్ద అక్కయ్య, చిన్నన్నయ్య అన్నారు. అది జరిగాక ఈ వారం రోజుల్లోనూ పెళ్ళిలో చేసే పద్ధతులు, అందులో ఆచారాలు మారాలని ఉపన్యాసాలు దంచాడు.

"అసలీ ఖర్చంతా దేనికి? మనిద్దరం ఇష్టపూర్తిగా పెళ్ళి చేసుకుంటున్నాం. సింపుల్‌గా ఉంగరాలు మార్చుకుంటాం. లేకపోతే దండలు మార్చుకుంటాం. ఫొటోలు తీయించుకొని ఓ డిన్నర్ ఇస్తాం. దట్సాల్. నిన్ను పెద్ద తట్టలో పెట్టి మీ మేనమామలు తీసుకొచ్చారు చూడూ! అది చాలా అబ్సర్డ్"

"ఈ ఆచారాలన్నీ మనం పెట్టామా? మనం తీసెయ్యడానికి?" అంది శ్రీలక్ష్మి. మళ్ళీ ఇదిగో....ఇప్పుడు తిరుపతి ప్రయాణం.

"అయితే తిరుపతి రానంటారు."

"రానంతే. పెళ్ళివిషయంలో మీ వాళ్ళెలాగూ ఒప్పుకోరని సంప్రదాయ పరమైన పెళ్ళికి ఒప్పుకున్నాను కాని ఈ ప్రయాణాన్ని మాత్రం ఒప్పుకోను"

శ్రీలక్ష్మి మరేం మాట్లాడకుండ అటువైపు తిరిగి పడుకుంది. సుకుమార్ లేచి గదిలో అటూ ఇటూ కొద్దిసేపు పచార్లు చేశాడు. తర్వాత ఆమె పక్కనే కూర్చొని అన్నాడు.

"నాకు ఈ గుళ్ళూ, గోపురాలు చూడ్డం ఇష్టం ఉండదు శ్రీలక్ష్మీ! కావాలంటే నువ్వెళ్ళు."

"వెళ్తే ఇద్దరం వెళ్ళాలి కాని నేనొక్కర్తెనే వెళ్తే బావుండదు."

"ఏం దేవుడి దగ్గర ఏమన్నా అటెండెన్స్ రిజిస్టర్ ఉందా? ఇద్దరం వచ్చామో లేదో చూసి హాజరు వేసుకోడానికి?"

"వేసుకుంటాడో లేదో చూడ్డానికి మీరెలాగూ రారుకదా" అంది శ్రీలక్ష్మి.

సుకుమార్ ఏం మాట్లాడకుండా పడుకున్నాడు. శ్రీలక్ష్మి అతని వైపు తిరిగింది. మెల్లిగా మోచేతి మీద లేచి అతని మొహంలో మొహం పెట్టి నడుంచుట్టూ చెయ్యేసింది. జాజిపూలవాసన, ఆమె వంటి మృదుత్వం శరీరానికి కాదు. అక్కడెక్కడో మనసులో తగుల్తున్నాయి.

"ప్లీజ్....ఈ ఒక్కసారికి రండి. నలుగురిలో అభాసుపాలుకాకుండా చూడండి. ప్లీజ్....ప్లీ...." అతని పెదాల మీద గాఢంగా ముద్దు పెట్టింది. ఆ బలహీనమైన క్షణాల్ని ఏ మగాడూ జయించలేడు. సుకుమార్ కూడా జయించలేకపోయాడు.

మర్నాడు తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో భార్య, అత్తమామలతో తిరుపతి వెళ్ళాడు సుకుమార్. బస్సు క్యూ చూశాక అతనికి తనసిద్ధాంతం మీద గౌరవం ఎక్కువైంది. దైవభక్తి పేరు మీద

పులిపాక

శ్రీరామచంద్రమూర్తి



జననం: 1954. నాలుగేళ్ళనించి వ్రాస్తున్నాను. గుప్పెడు కథలు, కాసినిన్ని కవితలు రాశాను. 1983 లో "ప్రకంపనం" పేరుతో ఆ కవితల్ని ప్రచురించాను. ఒక నవల "పంజరం" నవోదయ రామమోహనరావుగారు ఇటీవలనే ప్రచురించారు. ప్రస్తుతం ఆంధ్రప్రభ(విజయనగరం)లో సబ్-ఎడిటర్‌గా పని చేస్తున్నాను. రచనలకు ఏదైనా ప్రయోజనం ఉండాలని నా విశ్వాసం. చలం, శ్రీశ్రీ, రావిశాస్త్రి రచనలంటే ఎక్కువ గౌరవం. ఎప్పటికో....మంచి నవల మాత్రం రాస్తాను. ఈకథకు బహుమతి ఇచ్చిన "ఆంధ్రజ్యోతి" సంపాదకవర్గానికి కృతజ్ఞుడిని. ఈ పోటీలో పాల్గొన్న అందరికీ శుభాకాంక్షలు.

ప్రజలు ఎంత హింసని నిశ్శబ్దంగా భరిస్తున్నారు? అనిపించింది సుకుమార్‌కి. "శ్రీలక్ష్మి, అతని అత్తమామలు" ఆ క్యూలూ డబ్బు దోపిడీ అంతా దైవం తమ భక్తికి పెడుతున్న పరీక్షలు అనుకున్నారు. "ఇంకా నయం! కొండ ఎక్కుతామని మొక్కుకో లేదు" అనుకున్నాడతను.

స్నానం చేశాక మామగారు తలనీలాలు ఇచ్చారు. శ్రీలక్ష్మి, ఆమె తల్లి ఐదు కత్తెర్లు ఇచ్చారు. సుకుమార్ బైటే నిలబడ్డాడు. తర్వాత దైవ దర్శనం క్యూ ముందు అన్నాడతను. "మీరు వెళ్ళండి. నేనిక్కడ ఉంటాను."

"ఏవిటి మీరురారా?" అన్నారు మామగారు ఆశ్చర్యంగా.

"ప్లీ....జ్" అంది శ్రీలక్ష్మి.

"నువ్వు కూడా రా బాబూ! మీఇద్దరితో వస్తాననే మొక్కు కున్నాం" అంది అత్తగారు. నాస్తికులుంటారని వినడమే గాని ఆవిడెప్పుడూ అలాంటి వాళ్ళను చూడలేదు. అయిష్టంగానే క్యూలో ప్రవేశించాడు సుకుమార్. ఉదయం వెళ్ళినవాళ్ళు రాత్రి తొమ్మిది గంటలు దాటాక తిరిగివచ్చారు. అక్కడి నుంచి హుండీ దగ్గరికి వెళ్ళారు. మామగారు మూడొందలుతీసి వేశాడు. శ్రీలక్ష్మి ముడుపుకట్టిన ఉంగరం వేసింది. ఆహా! ఏం దానగుణం. ఇంటిముందుకొచ్చిన గుడ్డి బిచ్చగాడికి పదిపైసలుకూడా ఇవ్వరే! ఓ గాడ్! యు ఆర్ ది గ్రేటెస్ట్ కాపిటలిస్ట్. పైసా పెట్టుబడి లేకుండా కోట్లు సంపాదిస్తున్నావయ్యా!

దేవస్థానం బస్సులో కాటేజీకి వెళ్ళారు. స్నానంచేసి అత్తా మామా "తెప్పోత్సవం" చూస్తామని వెళ్ళారు. శ్రీలక్ష్మికీ వెళ్ళాలని ఉంది. దైవదర్శనం నుంచి వస్తూ కోనేట్లో అలంకరిస్తున్న తెప్పని చూసింది. కాని భర్త మరీ మండిపోతాడేమోనని ఉండిపోయింది.

సుకుమార్ ఆమెతో ఏం మాట్లాడలేదు. రకరకాల అర్చనలకి ఫీజు ఎంతో తెలియచేస్తూ పెట్టిన బోర్డుని కిటికీలోంచిచూస్తూ నిలబడ్డాడు.

శ్రీలక్ష్మిని మూఢనమ్మకాల విషవలయం నుంచి రక్షించాలనుకున్నాడతను. భర్తమీద దేవుడికి ఆగ్రహం రాకుండా చూడాలనుకుంది శ్రీలక్ష్మి.

తిరుపతి ప్రయాణం తర్వాత శ్రీలక్ష్మి కాపురానికివెళ్ళింది. తర్వాత ఓ నెలలోనే ఆమెకి ఒక ప్రభుత్వాఫీసులో ఉద్యోగం వచ్చింది. అదంతా తిరుపతి దేవుడి మహిమే ననుకుందామె. తనకు తెలిసిన మిత్రుడి ద్వారా గట్టిగా, ప్రయత్నించడం వల్లనే ఆ ఉద్యోగం వచ్చిందనుకున్నాడు సుకుమార్.

కాపరానికి వచ్చిన మొదటి రోజునే అతని పుస్తకాలు సర్దుతూ ఉలిక్కిపడింది శ్రీలక్ష్మి. అతని పుస్తకాలన్నిటిమీద "అణుకుమార్" అని నీట్‌గా వ్రాసివుంది. ఆ రాత్రి డైనింగ్ టేబుల్‌దగ్గర అంది శ్రీలక్ష్మి.

"మీ పేరు అణుకుమార్ అని రాసుకున్నారేం?"

"పేరు మార్చుకోవాలనుకుంటున్నాను. సుకుమార్ ఏమిటి? "మీనింగ్‌లెస్‌గా. అణుకుమార్....మనం తినే అన్నం అణువుల సముదాయం. ఈ నీరు అణువులే, ఈ ప్లేటు అణువులే. ప్రపంచంలోని ప్రతి వస్తువూ అణువులతో నిర్మింపబడింది. అందుకే అణుకుమార్ అని పేరు మార్చుకోబోతున్నాను ఎలా వుంది?"

"బాగానే వుంది" అంది శ్రీలక్ష్మి నిర్లిప్తంగా.

రోజులు గడుస్తున్న కొద్దీ ఇద్దరికీ కష్టాలు మొదలయ్యాయి. ఉదయాన్నే లేచి స్నానం చేసి, పూజచేసి, ఏవో శ్లోకాలు చదువుతూ తులసిమొక్క చుట్టూ ప్రదక్షిణాలు చేస్తుంది శ్రీలక్ష్మి.


"మొక్కలకి పూజలేమిటి? అబ్‌సర్డ్. ఈ మొక్క చుట్టూ తిరిగినప్పుడు గులాబీ మొక్క చుట్టూ కూడా తిరగాలి" అనేవాడు అణుకుమార్. శ్రీలక్ష్మి చిన్నగా నవ్వి ఊరుకునేది.

"ఈ కార్డు చూశారూ: ఇందులో వున్న విషయాన్ని ఇరవై ఉత్తరాల్లో రాసి పోస్ట్ చేస్తే చాలా మేలు జరుగుతుందిట. రాద్దాంవా?" అనేది శ్రీలక్ష్మి.

అణుకుమార్ ఆ ఉత్తరాన్ని చించేసాడు. అతను ప్రతి విషయంలోనూ ఆమెని ఎగతాళి చేసేవాడు. ఆమె అవకాశంవస్తే దైవనీతి గురించి చెప్పేది. వాళ్ళిద్దరికీ సినిమాల విషయంలో కూడా చాలా పెద్ద గొడవై పోయేది. ఆమెకి మెలోడ్రామాలు కావాలి. అతనికి అలాంటివి ఇష్టం వుండేదికాదు. ఊళ్ళో ఆలయ నిర్మాణానికి విరాళం ఇచ్చింది శ్రీలక్ష్మి. అతను ఘోరమైన తప్పుచేసినట్టు మూడు రోజులు మాట్లాడలేదు.

"శ్రావణమాసం వచ్చింది. నేను నోములు మొదలెడతాను" అంది శ్రీలక్ష్మి ఓరోజు.

"చాలా అనవసరం."



## భోపాల్

పగలంతా మోసిన తమ బాధల బరువుని
ప్రజల నిద్ర మెట్లమీదికి నింపాదిగా దింపుతున్నప్పుడు
అవిరామ పరిశ్రమకు అలసిన జీవకణాల బ్యాటరీల్ని
విశ్రాంతి ద్వారా చైతన్య విద్యుత్తుతో నింపుతున్నప్పుడు
చెమట స్వేదంతో తడిసిన జీవన వసనాల్ని
చీకటి తీగలపైన ఆరేస్తున్నప్పుడు
చిరిగిన ఆశయాల్ని, పగిలిన ఊపిరితాల్ని
స్వప్నాల షాపుల్లో సరిచేస్తున్నప్పుడు
గట్టు తెగి ముట్టడించిన ప్రమాదం
కరకు విధిపరచిన విషాదం



నిబిడ నిశ్శబ్దాన్ని నిలువునా చీల్చుకుంటూ
నిశీథిలో భూగర్భపు బోను నుండి బయటకురికి
విషపు జూలు గాలిలోకి విదిలిస్తూ
విహరించిన మృత్యుసింహపు పెనుగర్జన
గాజుపెంకులైన కళ్ళు, శూన్యపు దైన్యపు చూపులు
లయ తప్పిన గుండియలూ, తెగిపోయిన ఊపిరులూ
వేలకొద్దీ జనం విగతజీవులైన క్షణం
సంఖ్యల కందని మృతులు, సామూహికంగా రగులుతున్న
చితులు
ఒక్కసారి ఆరిన అగణిత జీవిత దీపాల్—భోపాల్
ఎన్నటికీ ఆరని అసంఖ్యాక హృదయ తాపాల్—భోపాల్

—కె. దినకర్

"ఆ నోములు చేస్తే చాలా ఫలితాలుంటాయి."

"ఏం ఉండవు. దిక్కుమాలిన పతివ్రతల కథలు చదవడం తప్ప."

"మా ఇంట్లో అందరూ నోచుకున్నారు. నేనూ నోచుకుంటాను."

"కార్తీక మాసంలో స్నానాలు చెయ్యవా?" అడిగాడు అణుకుమార్, వ్యంగ్యంగా. "అవీ చేస్తాను" అంది

"నేను ఒప్పుకోను" అన్నాడు అణుకుమార్. ఆమె ఏం మాట్లాడలేదు. రెండు నిమిషాల తర్వాత అతను తలెత్తి చూస్తే ఆమె కళ్ళలో నీళ్ళు. లేచి వెళ్ళి పక్కనే కూర్చుని ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు అణుకుమార్.

"ఈ నోములూ, వ్రతాలూ, కార్తీక స్నానాలు, పూజలూ వీటిలో హేతువు లేదు శ్రీలక్ష్మి. మనుషుల కష్టసుఖాలు వీటి మీద ఆధారపడతాయంటే నాకేం విశ్వాసం ఉండదు"

"మీరు ప్రతిదీ నియంతలాగా శాసిస్తారు. ఆ మాత్రం స్వేచ్ఛ లేదా నాకు?" అడిగింది శ్రీలక్ష్మి. కళ్ళు తుడుచుకుంటూ.

"స్వేచ్ఛ కాదు ప్రశ్న. లాజిక్" అన్నాడు అణుకుమార్.

"ది హెల్ విత్ లాజిక్. నాకు లాజిక్‌తో సంబంధంలేదు విశ్వాసం అంతే"

"నీది విశ్వాసం, నాది హేతువు" అన్నాడు అణుకుమార్ నిట్టూరుస్తూ.

అలా విభేదాలతోనే సంవత్సరం గడిచింది. శ్రీలక్ష్మికి పాప పుట్టింది. హాస్పిటల్లో ఆమె బెడ్ పక్కనే స్టూలు మీద కూర్చొని నిద్రపోతున్న పాపవైపు కన్నార్పకుండా చూశాడు అణుకుమార్. అతనికి లోపలనించి ఏదో గర్వం తన్నుకొచ్చింది.

"పాపకి మా అమ్మమ్మ పేరు పెడదాం" అంది శ్రీలక్ష్మి కూతురి వైపు ప్రేమగా చూస్తూ.

"ఏమిటా పేరు?"

"రాజ్యలక్ష్మి."

"నాకా పేరు ఇష్టంలేదు."

"పోనీ మీకు నచ్చిన పేరు చెప్పండి."

"సిరియస్."

"అదేం పేరు? పియర్‌లెస్ లాగా" అంది శ్రీలక్ష్మి చాలా ఆశ్చర్యంగా.

"అదో కాంతివంతమైన నక్షత్రం పేరు. ఆ పేరు పెట్టాలని ఆరెన్నెల్లనించి అనుకుంటున్నాను."

"ఆ పేరు మన బంధువుల్లో ఎవరికీ నచ్చదు" తనకు నచ్చకపోవడాన్ని బంధువుల మీదికి నెట్టింది శ్రీలక్ష్మి.

"మీకు నచ్చుతుందా లేదా అని నేను వాళ్ళని అడగను."

"నా కూతురికి ఆ పేరు పెట్టడం నేను ఒప్పుకోను" అంది శ్రీలక్ష్మి.

"నా కూతురికి ఆ పేరు తప్ప మరోటి పెట్టను" అన్నాడు అణుకుమార్. ఇద్దరూ కొద్దిసేపు వాదులాడుకున్నారు. పరిసరాలు కూడా మరిచిపోయి.

"ఏమిటా గొడవ?" అంటూ వచ్చింది నర్స్.

"ఏం లేదు" గాభరాగా అంది శ్రీలక్ష్మి. నర్స్ వెళ్ళిపోయాక వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకోలేదు. అణుకుమార్ లేచి బైటకి వెళ్ళాడు.

తర్వాత పాప పుట్టిన నక్షత్రం మంచిది కాదంటూ శాంతి చేయించాలంది శ్రీలక్ష్మి. అణుకుమార్ ఒప్పుకోలేదు. ఆ కోపం శ్రీలక్ష్మి మనసులో చాలాకాలం వుండిపోయింది. తనూ చదువుకుంది. అతనితో సమానంగా సంపాదిస్తోంది. నమ్మకాలు వేరైతే వేరు కావచ్చు. కాని తను అనుకున్న వాటిలో దేనికీ ఒప్పుకోకపోవటం శ్రీలక్ష్మికి బాధ కలిగించింది.

నీ భార్య ఇంత మూఢభక్తురాలైతే నువ్వుచేస్తున్నదేమిటి? అని ప్రముఖ చార్వాకులు, గోరాగారు నిలదీసి ప్రశ్నిస్తున్నట్టే ఫీలయ్యాడు అణుకుమార్.

"నాకు చాలా బాధగా ఉంది" అంది శ్రీలక్ష్మి ఆ రాత్రి

"నాకూ అలాగే ఉంది".

"నా నమ్మకాలేవో నావి. వాటిని మీరు వేలెత్తి చూపించి బాధపెట్టకూడదు."

"నీ నమ్మకాల్లో దేనికి తలాతోకా లేదు. అందుకే వాటిని వదిలేయమంటున్నాను."

"నేను వీటిని వదులుకోలేను."

"నేను వాటిని ఖండించకుండా ఉండలేను"

"ఇలా అయితే మనం జీవితాంతం...."

"కలసి బతకలేం" అన్నాడు అణుకుమార్. శ్రీలక్ష్మి షాక్ కొట్టినట్టు ఉలిక్కిపడింది.

"అంటే....అంటే మీ ఉద్దేశం విడాకులు తీసుకుందామనా!"

"అవును" అన్నాడు అణుకుమార్.

శ్రీలక్ష్మి మనసు దిటవు చేసుకోడానికి రెండ్రోజులు పట్టింది. ఆ రెండు రాత్రులూ ఏడ్చింది. తామిద్దరూ కలిసి భోంచేసి చాలాకాలమైంది. ఒకరొకరు ప్రేమగా పలకరించుకోవడం అదేదో గత జన్మలోలాగా ఉంది. ఇద్దరం సుఖంగా ఉన్నట్టు లోకాన్ని నమ్మించడం ఉత్తఆత్మవంచన. తనూ ఆలోచించగలదు. స్వతంత్రంగా బతగ్గలదు. ఎన్ని నీతులు చెప్పి, ఆదర్శాలు వల్లించినా మగాడు అనాది నుంచి స్త్రీని అణగదొక్కుతూనే ఉన్నాడు. అదీ ఆర్థికంగా అతని మీద ఆధారపడ్డం వల్ల. తనకా విషయంలో బెంగలేదు. ఈ విడాకుల విషయంలో తనే ముందుండాలి. అణుకుమార్‌లాంటి వాళ్ళకి కనువిప్పు కావాలి. అన్నయ్య ఫ్రెండు లాయరు ఆదినారాయణ ఈ ఊళ్ళోనే ఉన్నారు. పెళ్ళికి కూడా వచ్చారు. మర్నాడు ఆఫీసుకు సెలవు పెట్టి ఆదినారాయణ ఆఫీసుకు వెళ్ళింది.

ఆయన శ్రీలక్ష్మిని గుర్తుపట్టాడు. క్లయింట్లందరూ వెళ్ళాక ఆమె వైపు చూశాడు. విషయం ఏమిటన్నట్టు.

"మీరు ఎవరికైనా విడాకులు ఇప్పించారా?"

"చాలా మందికి ఇప్పించాను. ఆ విషయం ఇపుడెందుకు?"

"నాక్కూడా విడాకులు ఇప్పించాలి మీరు" అంది శ్రీలక్ష్మి. ఆదినారాయణ ఉలిక్కిపడి లేచి వెళ్ళి కూజాలో నీళ్ళు వంచుకొని తాగాడు. వచ్చి సీట్లో కూర్చొని అన్నాడు.

"నాతో ప్రాక్టికల్ జోకులు వెయ్యకూడదమ్మా"

"జోక్ కాదు బాబాయిగారూ! మీరు నాకు విడాకులు ఇప్పించాలి."

"కారణం ఏమిటి?"

"అభిప్రాయ భేదాలు."

"వాటిని కోర్టు విడాకుల విషయంలో బేస్‌గా గుర్తించదు. బలమైన కారణాలుండాలి. విదేశాల్లోలాగా భర్త గురక పెట్టినా, భార్య రేడియో వాల్యూంను పెంచినా, గట్టిగా దగ్గినా విడాకులు ఇక్కడ మంజూరు చెయ్యరు. కాకపోతే భర్త కంటే భార్యకు విడాకుల విషయంలో కొంత ప్రిఫరెన్స్ ఇస్తారు. కొన్ని ప్రశ్నలు వేస్తాను. మొహమాట పడకుండా జవాబులు చెప్పు"

తలూపింది శ్రీలక్ష్మి.

"మీ వారు తాగుబోతా?"

"కాదు"

"తిరుగుబోతా?"

"ఛ....ఛ....అదేంకాదు"

"శాడిస్టా?"

"కాదు"

"వేరే ఆమెని పెళ్ళిచేసుకున్నాడా?"

"ఛ....పాపం ఆయన చాలా మంచివారు" అంది శ్రీలక్ష్మి నొచ్చుకుంటూ.

"మీ పెళ్ళి జరిగి రెండేళ్ళు కూడా కాలేదు. విడాకులు కావాలంటే భార్యాభర్తల మధ్య మూడేళ్ళపాటు ఎలాంటి సంబంధం ఉండకూడదు. నీ భర్త మంచివాడేనంటున్నావ్. విడాకులతో పనేమిటి?"

"నేను పరమ ఆస్తికురాల్ని. ఆయన పరమ నాస్తికుడు. ఇద్దరికీ అభిప్రాయభేదాలొచ్చాయి. మా మధ్య మాటలుకూడా లేవు" అంది శ్రీలక్ష్మి తలవంచుకొని.

"మోస్ట్ పెక్యూలియర్ కేస్. ఎవరి నమ్మకం వారిది. దాని గురించి మీరు ఎక్కువగా ఆలోచించారనుకుంటున్నాను. సంసారానికి మూల సూత్రాలు ఏవిటో నీకు తెలుసా?" అడిగాడు ఆదినారాయణ నవ్వుతూ. శ్రీలక్ష్మి తెలీదన్నట్టు తలఅడ్డంగా తిప్పింది.

"మొదటిది డబ్బు. రెండోది సెక్స్"

శ్రీలక్ష్మి మొహం ఎర్రబడ్డం ఆయన గమనించాడు.

"మూడోది రాజీపడ్డం. ఈ మూడింటిలో ఏ రెండు ఉన్నా మిగతా ఒక్క సూత్రాన్ని తేలికగా సాధించొచ్చు."

"ఇద్దరం ఒకే ఇంట్లో ఉంటూ బాధపడ్డం ఎందుకు? అందుకే ఈ అభిప్రాయానికి వచ్చాను" అంది శ్రీలక్ష్మి.

"నేను అతనితోకూడా మాట్లాడుతాను."

"ఎలాగైనా విడాకులు వచ్చేలా చూడండి" అంది శ్రీలక్ష్మి లేస్తూ.

ఆదినారాయణ ఏదో ఆలోచిస్తూ అలాగే కూర్చుండిపోయాడు.

ఆ రాత్రి ఎటో చూస్తూ అంది శ్రీలక్ష్మి. "ఉదయం లాయరుగారి దగ్గరికి వెళ్ళాను"

"ఏమన్నారేమిటి!"

"మనకు విడాకులు ఇచ్చే అవకాశం లేదన్నారు."


"ఆ మాటకు సంతోషించావా?"

"లేదు" అంది శ్రీలక్ష్మి.

"నేనూ లాయర్ దగ్గరకి వెళ్ళాను. మూడేళ్ళు మనమధ్య ఎలాంటి సంబంధం ఉండ కూడదన్నారు. మనం బాండ్ పేపర్ల మీద అలా రాసుకుందాం"

"అలాగే" అంది శ్రీలక్ష్మి చాలా బింకంగా.

ఆ రాత్రి ఇద్దరూ నిద్రపోలేదు. ఒకరివైపు మరొకరు చూస్తూ కాలక్షేపం చేశారు. మర్నాడు ఉదయం అణుకుమార్ బాండ్ పేపర్లు తెచ్చాడు. తమ మధ్య ఎలాంటి సంబంధం ఇక ముందు వుండదంటూ రాసి సంతకాలు చేశారు ఇద్దరూ. అతనిచ్చిన బాండ్ పేపరు చదివి పెద్దగా వెక్కివెక్కి ఏడ్చింది శ్రీలక్ష్మి. అణుకుమార్ ఆ రోజు మొదటిసారి బార్‌కి వెళ్ళాడు.



ఆ రోజు నించి తామిద్దరి మధ్య ఏం సంబంధం వుండదంటే అతనికి చాలా విచిత్రంగా అనిపించింది. అవును.... తన ఆదర్శాలను అర్థంచేసుకోని భార్యతో తను సంసారం చేయలేడు. శ్రీలక్ష్మికి మర్నాటినించి తనూ, కూతురూ ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ వుండడం ఆలోచిస్తేనే చాలా భయం వేసింది. కాని కోపం అలాగే వుంది. ప్రపంచంలోని ఆడవాళ్ళంతా ఏ నమ్మకాలు లేకుండానే సంసారం చేస్తున్నారా? తనని అవమానపరిస్తే ఎంతకాలం భరించగలదు? అతనికీ విషయంలో గుణపాఠం చెప్పాలి. ఇద్దరిలోనూ టెన్షన్ ఎక్కువైపోయింది. తన బట్టలు పుస్తకాలు పాక్ చేశాడు అణుకుమార్. శ్రీలక్ష్మి వంటపాత్రలు, చీరెలు సర్దుకుంది. "ఇది మీది" అంటూ వేలికున్న ఉంగరాన్ని తీసిచ్చింది ఆమె. "ఇది నువ్విచ్చిందే" అంటూ తన చేతికున్న ఎలెక్ట్రానిక్ వాచీ ఇచ్చాడు అణుకుమార్. తన మొదటి జీతంతో ఆ వాచీ కొనిచ్చిందామె.

అంతలో పోస్ట్‌మాన్ వచ్చి "రిజిష్టర్డు లెటర్ సార్" అన్నాడు.

అణుకుమార్ సంతకం చేసి తీసుకున్నాడు "మీ కూడా" అన్నాడతను. శ్రీలక్ష్మి చాలా ఆశ్చర్యంగా సంతకం చేసి లెటర్ తీసుకుంది.

ఇద్దరూ కవర్లు చించి లోపలి కాగితం మీద ఉన్న ఒకే ఒక్క ఇంగ్లీషు వాక్యం చూసి ఉలిక్కిపడ్డారు.

"జీవితం అన్ని సిద్ధాంతాలకంటే బలీయమైనది. అత్యున్నతమైనది."

రెండు క్షణాల తర్వాత మెల్లిగా అడిగాడు అణుకుమార్.

"మీకు అభ్యంతరం లేకపోతే, మీ కొచ్చిన ఉత్తరంలో ఏం రాసుందో చెబుతారా?"




ఆ మాటలకు బాంబుపడ్డట్టు ఉలిక్కిపడింది శ్రీలక్ష్మి. నిజమే పరిచయంలేని వాళ్ళని బహువచనంలోనే సంబోధిస్తాం. ఏం ఉందో చెప్పింది శ్రీలక్ష్మి.

"ఇందులోనూ అదే వాక్యం ఉంది" అన్నాడు అణుకుమార్ నిదానంగా.

"నిజం కాదూ"

"ఇవి నీవి, అవి నావని వస్తువుల్ని ఇచ్చుకున్నాం. ఇక ముందు సంబంధం ఉండదని బాండ్ పేపర్లు రాసుకున్నాం. మనం ఒకరికొకరు ఇచ్చుకోలేనివి, తీసుకోలేనివి ఏవో వున్నాయి. జీవితం విలువ నాకు ఈ క్షణంలోనే తెలిసింది శ్రీలక్ష్మి" అన్నాడు అణుకుమార్ చేతిలోని బాండ్ పేపరు చించేస్తూ.

పరిగెత్తుకుంటూ వెళ్ళి అతన్ని గట్టిగా పెనవేసుకుపోయింది శ్రీలక్ష్మి.

ఇంటిముందు రెండు క్షణాలు స్కూటర్ ఆపి, వాళ్ళని చూసి, నవ్వుకుంటూ వెళ్ళిన ఆదినారాయణని వాళ్ళిద్దరూ గమనించలేదు.

✱

రోజంతా తుమ్ముతూ గడపకండి



జలుబు వల్ల ఒక మంచి రోజును పాడవనివ్వకండి. ముక్కు కారడం, ఛాతీలో కఫం మరియు తలభారం. ఇవన్నీ జలుబు లక్షణాలు. మీరు బాధపడుతారు. ఒక మంచి రోజు పాడవుతుంది. మరి అలాంటప్పుడు తెలివైన పని ఎందుకు చేయకూడదు? కోల్డరిన్ వాడి చూడండి. ఇది ప్రత్యేకంగా తయారు చేయబడిన జలుబు బిళ్ళ. ఎంతో అనుకూలమైనది. ఎంతో ఉపశమనం ఇస్తుంది.

జలుబుతో బాధ పడటం ఎందుకూ?
తీసుకోకూడదూ?

